ఖమ్మం గడ్డపై ఉద్యోగుల మహాగర్జన



3 లో..

www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 207, శుక్రవారం 28-8-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

సింగరేణిలో తగ్గుతున్న కార్మికుల సంఖ్య..

## వెలవెలబోతున్న కార్మికవాడలు



3వ పేజీల్లో

# మీర్ ఆలమ్ చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి పనులను పరిశీలించిన సీఎం

### మీర్ ఆలమ్ చెరువు మధ్యలో ఉన్న ఐల్యాండ్‌లను అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశాలు

### చెరువులో మురుగు నీరు కలవకుండ చర్యలు తీసుకోవాలి

### చింతల్ మెట్ నుంచి కిషన్ బాగ్ వరకు రోడ్డు ను విస్తరించాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



మీర్ ఆలమ్ చెరువు మీదుగా నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం గురించి ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ని అడిగి తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి



భారీ క్రేన్ పై నుంచి మీర్ ఆలమ్ చెరువు ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి



మీర్ ఆలమ్ చెరువు లో ఎక్కడెక్కడ ఎలాంటి పనులు చేపడుతున్నామో వివరిస్తున్న ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఇ వి నరసింహ రెడ్డి, గౌతమి లు



మీర్ ఆలమ్ చెరువు ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి

**బుద్వేల్ , ఆగస్టు 27 :**

చింతల్ మెట్ మీర్ ఆలమ్ పార్కు నుంచి మీర్ ఆలమ్ చెరువు మీదుగా శాస్త్రిపురం చౌరస్తా వరకు రూ.430 కోట్లతో నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం పనులను గురువారం ఉదయం 8:30 గంటలకు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ ఐకానిక్ బ్రిడ్జి పనులను మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్) ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. ముఖ్యమంత్రి తో పాటు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఇ వి నరసింహ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి లు ఉన్నారు. మీర్ ఆలమ్ చెరువు మధ్యలో నుంచి 58 పిల్లర్ లతో ఐకానిక్ బ్రిడ్జి ని నిర్మిస్తుండగా ఇప్పటికే 33 పిల్లర్ లకు ఫౌండేషన్ పనులు ప్రారంభమయ్యాయి. నాలుగు నెలలుగా ఐకానిక్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. ఒక గంట పదిహేను నిమిషాల పాటు మీర్ ఆలమ్ చెరువు వద్ద ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం గురించి అధికారులు వివరించారు. బ్రిడ్జి నిర్మాణం గురించి ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ని ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జి నిర్మాణం గురించి అధికారులు ఇ వి నరసింహ రెడ్డి, గౌతమి లు ముఖ్యమంత్రి కి కూలంకుషంగా వివరించారు.

**మురుగు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

మీర్ ఆలమ్ చెరువు మీదుగా ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేస్తున్న నేపద్యం లో ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. చెరువు లోకి మురుగు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు, గుర్రపు డెక్క పెరగ కుండ చూడటం తో పాటు ఎప్పటి కప్పుడు తొలగించాలన్నారు. మూసి లో ఉన్న ఐ ల్యాండ్ లను అభివృద్ధి చేసి గార్డెనింగ్, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అక్కడ థీమ్ పార్కులను అభివృద్ధి చేయాలన్నారు.

**చింతల్ మెట్ నుంచి కిషన్ బాగ్ రోడ్డు ను విస్తరించాలి:**

చింతల్ మెట్ నుంచి కిషన్ బాగ్ వరకు ఉన్న రహదారి ని విస్తరించాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ గా కూడా ఉన్న సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ని ముఖ్యమంత్రి ఆదేశించారు. శంషాబాద్ లో గల రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కు సమీపంలో ఉన్న మీర్ ఆలమ్ చెరువు ను పర్యాటక ప్రాంతం గా అభివృద్ధి చేస్తే ఇక్కడికి దేశ విదేశాల నుంచి పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. అనుకున్న గడువు లోగా మీర్ ఆలమ్ చెరువు పై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఫైర్ డిపార్ట్ మెంట్ కు చెందిన భారీ క్రేన్ పై ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి మీర్ ఆలమ్ చెరువు ను, చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంట ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్య రాజ్ తదితరులు ఉన్నారు



# కాంగ్రెస్‌లో వ్యక్తిగత కోపాలకు తావు లేదు: మహేశ్ గౌడ్

### ఎఐసిసి పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

### అధిష్టానం తీసుకునే నిర్ణయం అందరికీ శిరోధార్యం

**నిజామాబాద్, ఆగస్టు 27:**

మంత్రి కొండా సురేఖ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా.. కుమార్తె కామెంట్స్‌కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందన్నారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉందని, అయితే అది క్రమశిక్షణకు లోబడి ఉండాలన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లోనే స్వేచ్ఛ ఎక్కువన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. ఇకపోతే తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు సర్ నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



# గవర్నర్‌కు సిఎం పరామర్శ

**హైదరాబాద్, ఆగస్టు 27 :**

అనారోగ్యంతో హై టెక్ సిటీ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను సిఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డితో కలసి వెళ్లిన సిఎం గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసారు. ఈ మేరకు గవర్నర్ ఆరోగ్యంపై వైద్యులను ఆరా తీసారు.

# యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు మరో 25 ఏళ్లపాటు యధావిధిగా కొనసాగాలి

### ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు

### ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ

### తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 27:**

లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ ..మిగతా 2లో



విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం

# బిజెపి అండ

### తెలంగాణలో నడుస్తున్నది పోలీస్ పాలన

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**హైదరాబాద్, ఆగస్టు 27:**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నడుపుతున్నది ప్రజా పాలన కాదు, పోలీసుల నిర్బంధ పాలన అని స్పష్టమవుతోందని బిజెపి విమర్శించింది. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే వివాదాస్పద జీవో 97ను ..మిగతా 2లో

బిల్లింగ్ పూర్తి చేయాలి.. సమస్యలు పరిష్కరించి

# బకాయిలు వసూలు చేయాలి

### జలమండలి ఎండీ అశోక్ రెడ్డి





### హై ప్రయారిటీ బకాయిదారులపై ప్రత్యేక దృష్టి

### దీర్ఘకాల బకాయిదారులను అధికారులే వ్యక్తిగతంగా సంప్రదించాలి

### రెవెన్యూ వివాదాల పరిష్కారానికి సర్కిల్ స్థాయిలో కమిటీ

### ఆX ఆధారిత రెవెన్యూ డ్యాష్‌బోర్డ్‌తో బకాయిల వసూళ్లకు మరింత బలం

**హైదరాబాద్, ఆగస్టు 27:**

జలమండలి పరిధిలో వంద శాతం బిల్లింగ్ పూర్తి చేయడంతో పాటు దీర్ఘకాలిక బకాయిల వసూళ్లు, బిల్లింగ్ వివాదాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జేఎండీ మయాంక్ మిట్టల్ తో కలిసి గురువారం రెవెన్యూ పనితీరుపై ఈడీలు, డైరెక్టర్లు ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జోన్, సర్కిల్, డివిజన్ వారీగా అన్‌బిల్డ్, అన్‌పెయిడ్ జూచీలు, డిమాండ్, కలెక్షన్ వివరాలను ప్రత్యేక రెవెన్యూ డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిశీలించారు. ఏళ్ల తరబడి బకాయిలు ఉన్నప్పటికీ కొన్ని కనెక్షన్లకు నీటి సరఫరా కొనసాగుతుండటంపై ఎండీ ..మిగతా 2లో

# జివో 97ను రద్దు చేయాల్సిందే

### హరీష్ రావు డిమాండ్

**హనుమకొండ, ఆగస్టు 27 :**

పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. హనుమకొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 97 జీవోను రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు దిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఏంటని దుయ్యబట్టారు. అంతకుముందు హనుమకొండలోని కలెక్టరేట్ వద్ద టీఎస్జీవోలు నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని మద్దతు తెలిపారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.



## బిల్లింగ్ పూర్తి చేయాలి.. సమస్యలు పరిష్కరించి

# బకాయిలు వసూలు చేయాలి

మొదటి పేజీ తరువాయి...

అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి జూచీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, మీటర్, బిల్లింగ్ లేదా ఇతర సమస్యలను పరిష్కరించి బకాయిలను వసూలు చేయాలని ఆదేశించారు. అలాగే బకాయిలు ఉన్నాయనే కారణంతో విచక్షణారహితంగా కనెక్షన్లు తొలగించడం సరైన పరిష్కారం కాదన్నారు. అధిక డిస్‌కనెక్షన్ల వల్ల డిస్ప్యూట్లు పెరిగి, చివరకు రెవెన్యూ వసూళ్లపైనా ప్రభావం పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల వినియోగదారుడి సమస్యను గుర్తించి, పరిష్కరించి, రావాల్సిన మొత్తాన్ని వసూలు చేయడానికే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దీర్ఘకాలిక బకాయిల విషయంలో అధికారులే ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవాలని ఆదేశించారు. ఐదేళ్లకు పైగా బకాయి ఉంటే జీఎం, ఏడాదికి పైగా ఉంటే డీజీఎం, ఆరు నెలలకు పైగా ఉంటే సంబంధిత మేనేజర్ స్వయంగా వినియోగదారులను సంప్రదించాలని సూచించారు. బిల్లింగ్, మీటర్ లేదా ఇతర వివాదాలు ఉంటే వాటిని పరిష్కరించి వసూళ్లకు చర్యలు తీసుకోవాలన్నారు. వీటితోపాటు హై ప్రయారిటీ బకాయిదారులను గుర్తించి ఒక్కో మేనేజర్‌కు 10 జూచీల చొప్పున అప్పగించాలని, వాటిని పరిష్కరించిన తర్వాత మరో 10 జూచీలు ఇవ్వాలని సూచించారు. మూడు రోజుల తర్వాత పురోగతిని తిరిగి సమీక్షిస్తామని తెలిపారు. టాప్-10, టాప్-100 బకాయిదారుల జాబితాలను రూపొందించి క్షేత్రస్థాయి సిబ్బందికి అందించి నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. బల్క్ కనెక్షన్లు, మీటర్లు లేకపోవడం, పాత బిల్లులు తదితర కారణాలతో పెండింగ్‌లో ఉన్న డిస్ప్యూట్ల పరిష్కారానికి సర్కిల్ స్థాయిలో 4--5 మంది అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీ వారానికి ఒక రోజు సమావేశమై కనీసం 10--15 డిస్ప్యూట్లను పరిశీలించి పరిష్కరించేలా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలన్నారు. అదేవిధంగా డాకెట్ యావరేజ్ బిల్లింగ్‌లో ఉన్న వ్యత్యాసాలను 15 రోజుల పాటు అధ్యయనం చేసి విశ్లేషణాత్మక నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ సమీక్షలను కేవలం బిల్లింగ్, వసూళ్లకే పరిమితం చేయకుండా నీటి సరఫరా, పనుల పురోగతి, సేవా ఫిర్యాదులు, రెవెన్యూ తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించాలని సూచించారు. ప్రతి స్థాయిలో అధికారులకు స్పష్టమైన బాధ్యత ఉండాలని, డేటా ఆధారంగా రోజువారీ పనితీరును పర్యవేక్షిస్తూ బిల్లింగ్, డిస్ప్యూట్ల పరిష్కారం, బకాయిల వసూళ్లలో గణనీయమైన పురోగతి సాధించాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు.

**ఏఐ డ్యాష్‌బోర్డ్‌తో మరింత సమర్థవంతంగా రెవెన్యూ వసూళ్లు: జేఎండీ మయాంక్ మిట్టల్**

అధునాతన కృత్రిమ మేధస్సు (ఏఐ) పరిజ్ఞానంతో రూపొందిస్తున్న రెవెన్యూ డ్యాష్‌బోర్డ్ ద్వారా బిల్లింగ్, బకాయిలు, కలెక్షన్లు, వివాదాల, హై ప్రయారిటీ క్యాన్ లను వేగంగా గుర్తించేందుకు వీలవుతుందని ఎండీ తెలిపారు. జోన్ నుంచి వ్యక్తిగత క్యాన్ వరకు అవసరమైన సమాచారాన్ని విశ్లేషించి, ఎక్కడ బిల్లింగ్ పెండింగ్‌లో ఉంది, ఎక్కడ వసూళ్లు తక్కువగా ఉన్నాయి, ఏ కనెక్షన్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలనే అంశాలను గుర్తించేందుకు ఈ డ్యాష్‌బోర్డ్ దోహదపడుతుందన్నారు. తద్వారా అధికారులకు లక్ష్యాలను నిర్దేశించి, బకాయిల వసూళ్లను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ఏఐ ఆధారిత ఈ డ్యాష్‌బోర్డ్‌ను రానున్న రోజుల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో రీజనల్ డైరెక్టర్లు పంకజ, సాఫ్రాట్ అశోక్, సంతోష్, ఆపరేషన్ డైరెక్టర్లు నారాయణ, వాసా సత్యనారాయణ, ప్రభు, రెవెన్యూ డైరెక్టర్ కిరణ్ కుమార్, సీజీఎంలు, జీజీఎంలు, రెవెన్యూ, ఐటీ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



## రూ.40.70కోట్ల విలువైన ధాన్యం పక్కదారి కేసులో మిల్లర్ రిమాండ్ తరలింపు

**గద్వాల, ఆగస్టు27 :**

2022-23 రబి, 2024-25 ఖరీఫ్,2024-25 రబి సం బంధించి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన 12643.040 మెట్రిక్ టన్నుల ధాన్యం రూ.40.70 కోట్ల విలువైన సీఎంఆర్ దుర్వినియోగం చేసిన కేటిదొడ్డి మండలం నందిన్నెలోని శ్రీకమ్మిడి స్వామి రైస్‌మిల్లు నిర్వాహకుడు కుర్వ వీరన్నపై కేసు న మోదు చేసి, రిమాండ్ కు తరలించినట్లు గద్వాల డీఎస్పీ వై.మొగులయ్య తెలిపారు. గద్వాల డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నందిన్నె గ్రామంలోని శ్రీకమ్మిడి స్వామి రైస్ ఇండస్ట్రీస్‌లో రూ.40.70 కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ దుర్వినియోగం చేశారని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు.

## విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం

# బిజెపి అండ

మొదటి పేజీ తరువాయి...

రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్, మాసాబ్‌ట్యాంక్, రామంతపూర్ నుంచి మొదలుకొని వనపర్తి, పరకాల దాకా విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా రోడ్డెక్కితే.. వారిపై లాఠీఛార్జీలు చేయించడం, అరెస్టులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల న్యాయమైన ఆందోళనకు మద్దతు తెలపడానికి వెళ్తున్న మా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తో పాటు పార్టీ ముఖ్య నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయించడం కాంగ్రెస్ పిరికితనానికి నిదర్శనం. చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పాలిత తెలంగాణలో విద్యార్థుల హక్కులను కాలరాస్తుంటే ఎందుకు కనిపించడం లేదన్నారు. పాలిటెక్నిక్ సాంకేతిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, విద్యార్థులకు ఉన్నత విద్య (ఈసెట్) అవకాశాలను దూరం చేసే కుట్రలను రేవంత్ రెడ్డి సర్కార్ తక్షణమే విరమించుకోవాలి. కంటితుడుపు కమిటీలతో కాలయాపన చేయకుండా వివాదాస్పద జీవో 97ను వెంటనే బేషరతుగా రద్దు చేయాలి. తెలంగాణ విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం భారతీయ జనతా పార్టీ అండగా నిలబడి చివరిదాకా రాజీలేని పోరాటం చేస్తుంది.

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు మరో 25 ఏళ్లపాటు యధావిధిగా కొనసాగాలి

మొదటి పేజీ తరువాయి...

స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

# మిల్లర్లో గుబులు రేపుతున్న సీఎంఆర్ ధాన్యం

**సీఎంఅర్ దుర్వినియోగం కేసులో నందిన్నెలోమి రైస్ మిల్లర్ పై కేసు నమోదు, లిమిల్లు నిర్వాహకుడు అరెస్టు**

**ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని ఇచ్చినట్లే అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్న వైనం**

**బకాయిల జాబితాలో మరికొన్ని మిల్లులు**

**చాలా రైస్ మిల్లులో దాన్యం నిల్వలు లేకున్నా అధికారులు పట్టించుకోని వైనం**

**గద్వాల :**

రైతుల నుంచి ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు అప్పగించడం, రైస్‌మిల్లర్లు వాటిని మర ఆడించి బియ్యం ఇవ్వకుండా.. తమకిచ్చిన ధాన్యాన్ని ఇచ్చినట్లే అమ్ముకోవడం జోగులాంబ గద్వాల జిల్లాలో నిత్య కృత్యంగా మారిపోయింది. రైస్ మిల్లర్ల అక్రమ దందాకు సివిల్ సప్లయ్ అధికారులు, రాజకీయ నాయకులు అండదండలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో మిల్లర్లు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా తయారైంది. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా సంవత్సరాల నుంచి చాల రైస్ మిల్లులు మొండి బకాయిలు పేరుకుపోయాయి. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ను ప్రభుత్వానికి అప్పజెప్పకుండా, మింగిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు చెల్లించకుండా రైస్‌మిల్లర్లు దొంగాట ఆడుతున్నారు. రైతుల నుంచి ధాన్యాన్ని ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొని.. రైస్‌మిల్లులకు కేటాయిస్తుంది. రైతుల నుంచి ధాన్యా న్ని ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొని.. రైస్‌మిల్లులకు కేటాయిస్తుంది. మిల్లర్లు వాటిని బియ్యంగా మార్చేందుకు కేవలం జాబ్‌వర్క్ (అద్దెపని) మాత్ర మే చేయాలి. ఇందుకుగాను ప్రభుత్వం మిల్లింగ్ చార్జీలు చెల్లిస్తుంది. వడ్లు గానీ, బియ్యం గానీ అమ్ముకునే అధికారం రైస్‌మిల్లర్లకు లేదు. ప్రభుత్వం ఇచ్చిన నిర్ణీత గడువులో ధాన్యాన్ని మర ఆడించి బియ్యం అప్పజెప్పాలి. కాని జిల్లాలో రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం పక్కదారి పడుతోంది. ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. అక్కడ నుంచి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎక్కువ ధరకు ధాన్యాని విక్రయించి మిల్లర్లు కోట్లకు పడగెత్తారు. రైస్ మిలుల్లకు కేటాయించిన ధాన్యం ఏ ఏ రైస్ మిల్లులో ఎంత నిల్వ ఉందో జిల్లా పౌరసరఫరాల అధికారులు ఏ నాడు తనిఖీలు చేసిన పాపాన పోలేదు. జిల్లాలోని గద్వాల , ఇటిక్యాల, ఉండవెల్లి, అయిజ మండలాలోని రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం నిల్వలు బ్లాక్ మార్కెట్ కు తరలించినట్లు, పైగా అధికారుల నోటీస్



లో ఉన్నట్లు సమాచారం. రైస్ మిల్లర్లకు అధికారులు, రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతోనే ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. కాగ ఇటీవల జిల్లాలో రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. రైస్ మిల్లర్లు ఎఫ్ సీఐ కి అప్పజెప్పే బియ్యం కు బదులు రేషన్ డీలర్లు, అక్రమార్కుల నుంచి కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని ఎఫ్ సీఐ కి కేటాయిస్తున్నట్లు ఇటీవల రేషన్ బియ్యం అక్రమార్కులు బహిరంగానే చెప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది.

**నందిన్నెలోని శ్రీకమ్మిడి స్వామి రైస్ మిల్లుపై కేసు నమోదు**

ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం అయినట్లు కేటిదొడ్డి మండలం నందిన్నెలోని శ్రీకమ్మిడిస్వామి రైస్ మిల్లుల నుంచి ధాన్యం పక్కదారి పట్టిందని హైకోర్టు ఉత్తర్వులు మేరకు, రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్ కమీషనర్ అదేశాల మేరకు సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ (ఎన్ఫోర్స్మెంట్) , కాలూర్ తిమ్మన్ దొడ్డి, రీజినల్ విజిల్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మరియు టెక్నికల్ అసిస్టెంట్లతో కలిసి కమ్మిడిస్వామి రైస్ మిల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించి ఈనెల 17 న జిల్లా కలెక్టర్ కు సమర్పించిన నివేదిక ప్రకారం భారీగా ధాన్యం కొరత (తగ్గుదల) ఉన్నట్లు రూ.40.70 కోట్లకు పైగా ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టడంతో కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు.

2022-23 రభి సీజన్లో ప్రభుత్వం 1,425.520 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించింది. దీనికి బదులుగా 355.749 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ (జవీ=) ప్రభుత్వానికి అందజేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో 1,069.771 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ప్రభుత్వానికి బకాయి ఉన్నట్లు తేలింది. కాగ 2022-23 రబి సీజన్ కు సంబందించి 552.640 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లుల నుంచి పక్కదారి పట్టినట్లు సివిల్ సప్లయ్ అధికారులు గుర్తించారు. అలాగే 2024-25 ఖరీఫ్ సీజన్ కు 5,948.560 మెట్రిక్ టన్నులు కేటాయించగా 1,079.664 మెట్రిక్ టన్నులు మాత్రమే అందించగా 4,868.896 మెట్రిక్ టన్నులు పెండింగ్ లో ఉన్నాయి. మిల్లు నుంచి 4,315.240 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు అధికారుల విచారణలో తేలింది.

అలాగే 2024-25 రభి సీజన్ కు 10,380.160 మెట్రిక్ టన్నులు మిల్లుకు కేటాయించగా 1,253.903 మెట్రిక్ టన్నులు మాత్రమే సీఎంఆర్ రైస్ అందించగా 9,126.257 మెట్రిక్ టన్నులు పెండింగ్ లో ఉన్నాయి. మిల్లు నుంచి 7,775.160 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు అధికారుల విచారణలో తేలింది. సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ విమల ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో రైస్ మిల్ ప్రాంగణంలో ప్రభుత్వానికి సంబంధించిన ధాన్యం నిల్వలు కూడా కనిపించలేదని అధికారులు వెల్లడించారు. దీంతో ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారించి చర్యలకు ఉపక్రమించారు. ఒప్పంద నిబంధనల 2022-23, 2024-25, 2024-25 సీజన్ కు సంబందించి 12,643.40 మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి ఉన్నట్లు రూ.40,70,82,947.00 ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు లెక్కించారు. ఈ వ్యవహారంపై శ్రీ కమ్మిడిస్వామి రైస్ మిల్ యజమాని కుర్వ వీరన్నపై కేటిదొడ్డి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. పాతపాలెం ప్రభుత్వం ధాన్యం నిల్వ గోధాంలో గద్వాల డీఎస్పీ వై.మొగులయ్య, కేటిదొడ్డి ఎస్ఐ పి.శ్రీనివాసులు, సివిల్ సప్లయ్ అధికారులు తనికీలు చేపట్టారు. మిల్లు ఓనర్ కుర్వ వీరనన్ను అరెస్టు చేశారు.

**సివిల్ సప్లయ్ అధికారుల పాత్రపై అనుమానం**

2023, 2024, 2025 ధాన్యం కేటాయింపులపై పోలీసులు ఆ శాఖలోని కీలక ఉద్యోగుల పాత్రపై జిల్లా పోలీస్ అధికారులు విచారించినట్లు సమాచారం. సివిల్ సప్లయ్ అధికారులు తీసుకున్న చర్యలు, తని ఖీలు, నివేదికలపై ఆరా తీశారు. ఎన్ఫోర్స్మెంట్, విజెలెన్స్ అధికారుల నిఘా ఉన్నప్పటికీ మిల్లు నిర్వాహకుడు ప్రభు త్వాన్ని మోసం చేసిన తీరుపై అనుమానాలు వ్యక్తమవడంతో సివిల్ సప్లయ్ అధికారుల పాత్రనే కీలకంగా మారనున్నది.బయటపడుతున్న మరికొన్ని మిల్లుల వ్యవహారం జిల్లాలో 40 రైస్ మిల్లులకు ప్రభుత్వం రైతుల నుంచి వడ్లను సేకరించి ఇస్తే వాటిని మిల్లర్లు మరాడించి రైస్ ఇవ్వాలి. అయితే గద్వాల, ఇటిక్యాల, ఉండవెల్లి, అయిజ మండలాలో పలు రైస్ మిల్లులో భారీ సంఖ్యలో మిల్లర్లు వడ్లను, బియ్యాన్ని అమ్మేసుకున్నట్లు తెలుస్తోంది. నేటికి ఆ మిల్లులో పలు సీజన్ కు సంబంధించి దాన్యం నిల్వలు ఉండకపోవడం, ఇదంతా జిల్లా సివిల్ సప్లయ్ అధికారుల కనుసన్నాలలో నడుస్తున్నట్లు ప్రచారం. నిజానికి ఈ అక్రమాల్ని ఎప్పటికప్పుడు గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అధికారుల నిర్లక్ష్య ధోరణి, మిల్లర్లతో మిలాఖత్ అవడం ప్రభుత్వానికి నష్టం తెచ్చిపెడుతోంది. మిగత రైస్ మిల్లర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందో లేదో వేచి చూడాలి.

# రాఖీట్ల పండుగ సందడి

**గద్వాల జిల్లాలో రాఖీ పండుగ సందడి నెలకొంది**

**గద్వాల :**



అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పవిత్రంగా భావిస్తారు. ఇది శుక్రవారం రావడంతో గురువారం నుంచే రాఖీల కొనుగోలుకు యువతులు, మహిళలు పెద్ద ఎత్తున జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలకు రావడంతో సందడిగా మారింది. గద్వాల పట్టణం కొత్తబస్టాండ్, క్రిష్ణవేణి చౌరస్తా, పాతబస్టాండ్, షేరేల్లీ వీధి, గాంధీచౌక్, తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా రాఖీల దుకాణాలు వెలిశాయి. చిన్న పిల్లల నుంచి యువతులు, మహిళలను ఆకర్షించే రాఖీలను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. రూ. 10 నుంచి రూ.500 దాకా ధరలున్నాయి. పట్టణ వాసులతో పాటు నియోజక వర్గంలోని ధరూర్, కేటిదొడ్డి, మల్దకల్, అయిజ, ఎర్రవల్లి చౌరస్తా మండలాల గ్రామాల ప్రజలు రాఖీలు కొనుగోలతో వినియోగదారులతో వ్యాపార దుకాణాలు ఉదయం నుంచే కిటకిటలాడాయి. చిన్నారులు, యువతులు, మహిళలు రాఖీ దుకాణాల వద్ద బారులు తీరారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలలో స్వీటు షాపులు కూడా కళకళలాడుతున్నాయి.

# గద్వాలలో పోలీసుల కార్డెన్ సెర్చ్

**గద్వాల, ఆగస్టు27:**





గద్వాల పట్టణ పరిధిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం వద్ద జిల్లా ఎస్పీ టి.శ్రీని వాస రావు ఆదేశాల మేరకు గురువారం గద్వాల సీఐ టి.శ్రీను ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తనిఖీల్లో 50 మంది పోలీసు సిబ్బంది ఇంటింటికి వెళ్లి విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సెర్చ్‌లో భాగంగా సరైన పత్రాలు లేని 7 ద్విచక్ర వాహనా లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ టి.శ్రీను మాట్లాడుతూ.. వాహనాలకు సంబంధించి లైసెన్సులు, ఇతర పత్రాలు లేకుండా వాహనాలను రోడ్లపై నడపకూడదన్నారు. గంజాయి తదితర మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం నేరమన్నారు. ఆన్‌లైన్‌లో జరిగే మోసాల జోలికి వెళ్లొద్దని సూచించారు. మహిళలు, చిన్న పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఆపద సమయంలో వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం డయల్ 100 ప్లేస్ లో కొత్తగా డయల్ 112 ను తెలంగాణ పోలీసు వారు తీసుకురావడం జరిగిందన్నారు. డయల్ 112కు సమాచారం ఇవ్వడం వల్ల పోలీస్, అంబులెన్స్, ఫైర్ మూడు శాఖలు ఏకకాలంలో అవసరాన్ని బట్టి, చాలా తక్కువ సమయంలో ప్రజలకు సేవలందిస్తాయని తెలిపారు. ప్రజల రక్షణ కొరకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. కాలనీలో స్వీయ రక్షణ కోసం స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గద్వాల్ రూరల్ సిహెచ్ శ్రీకాంత్ సూచించారు. ఈ కార్యక్రమంలోహగద్వాల్ సర్కిల్ ఎస్ఐలు శ్రీహరి, శ్రీకాంత్, కళ్యాణ్ కుమార్, నందికర్, శేఖర్ గౌడ్, జహంగీర్, సర్కిల్‌హా కానిస్టేబుళ్లు, ఏ.ఆర్. కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం గడ్డపై ఉద్యోగుల మహాగర్జన





**- భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తరలివచ్చిన 5 వేల మంది ఉద్యోగులు**

**- టి.జి. జాక్ ఆధ్వర్యంలో మహాధర్నా.. కలెక్టర్‌కు వినతిపత్రం**

**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 27 (భద్రాద్రిన్యూస్) :** ఉద్యోగుల న్యాయమైన హక్కులు, ఆర్థిక, సర్వీస్ ప్రయోజనాల సాధన కోసం తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టి.జి. జాక్) ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం ఐ.డి.ఓ.సి కార్యాలయం ఎదుట భారీ మహాధర్నా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘాలకు చెందిన సుమారు 5 వేల మంది హాజరయ్యారు.

ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఐక్యతను, సంఘటిత శక్తిని చాటారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఒక్క గొంతుతో నినదించారు.

మహాధర్నాకు టి.జి. జాక్ ఖమ్మం జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, జిల్లా కన్వీనర్ కొంగర వెంకటేశ్వరరావు సమన్వయం చేశారు. వివిధ భాగస్వామ్య ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**ప్రధాన డిమాండ్లు:**

ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి ఆర్థిక, సేవా, ఆరోగ్య భద్రత కల్పించాలని టి.జి. జాక్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రధానంగా:

2వ పే రివిజన్ కమిషన్ (పి.ఆర్.సి.) నివేదికను వెంటనే తెప్పించి నిర్ణీత గడువులోగా అమలు చేయాలి.

పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలి.

సుమారు రూ.10 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను త్వరితగతిన చెల్లించాలి.

సి.పి.ఎస్.ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓ.పి.ఎస్.)ను పునరుద్ధరించాలి.

ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్/ఎన్ఈహెచ్ఎస్)ను సమర్థవంతంగా అమలు చేయాలి.

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి: శ్రీనివాసరావు

టి.జి. జాక్ జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సుమారు 5 వేల మంది ఉద్యోగులు ఒకే వేదికపైకి వచ్చి మహాధర్నాను విజయవంతం చేయడం ఉద్యోగుల ఐక్యతకు నిదర్శనమన్నారు. 2వ పి.ఆర్.సి., 6 డీఏలు, ఈహెచ్ఎస్, పెండింగ్ బిల్లులు, సి.పి.ఎస్. రద్దు--ఓ.పి.ఎస్. పునరుద్ధరణ వంటి అంశాలు ఉద్యోగుల కుటుంబాల ఆర్థిక భద్రత, భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయని తెలిపారు.

ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తూ ప్రజలకు సేవలందించేది ఉద్యోగ వర్గమేనని పేర్కొన్నారు. అదే సమయంలో ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలపై అందరూ ఒక్క గొంతుతో మాట్లాడితే ప్రభుత్వంపై విన్నపానికి మరింత బలం చేకూరుతుందని, ఐక్యత, క్రమశిక్షణతో ప్రజాస్వామ్య పద్ధతిలో హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగులది ప్రత్యేక పాత్ర అని గుర్తుచేస్తూ, వచ్చేనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమానికి ఖమ్మం నుంచి భారీ సంఖ్యలో ఉద్యోగులు తరలిరావాలని కోరారు.

**అన్ని సంఘాల సమన్వయంతోనే విజయవంతం: వెంకటేశ్వరరావు**

టి.జి. జాక్ జిల్లా కన్వీనర్ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ సంఘాలు సమన్వయంతో పాల్గొనడం వల్లే మహాధర్నా విజయవంతమైందన్నారు. ఉద్యోగుల ఆర్థిక, సేవా, పెన్షన్, ఆరోగ్య సమస్యల పరిష్కారానికి అన్ని సంఘాల మధ్య ఐక్యత, సమన్వయం అవసరమని పేర్కొన్నారు.

**కలెక్టర్‌కు వినతిపత్రం**

మహాధర్నా అనంతరం ఉద్యోగులు భారీ ర్యాలీగా ఖమ్మం కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. అనంతరం టి.జి. జాక్ నాయకులు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్ లిదివాకర టి.ఎస్.లిను కలిసి ఉద్యోగుల ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

2వ పి.ఆర్.సి. అమలు, 6 పెండింగ్ డీఏల విడుదల, సుమారు రూ.10 వేల కోట్ల పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఈహెచ్ఎస్/ఎన్ఈహెచ్ఎస్ సమర్థవంతమైన అమలు, సి.పి.ఎస్. రద్దు చేసి ఓ.పి.ఎస్. పునరుద్ధరణతో పాటు ఇతర ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు.

**భారీగా తరలివచ్చిన ఉద్యోగ సంఘాలు**

ఈ మహాధర్నాకు పెన్షనర్స్, టీఎస్‌యూటీఎఫ్, టీపీఏటీఎఫ్, మున్సిపల్ ఫోరం, ఇరిగేషన్ ఫోరం తదితర సంఘాలు భారీ ర్యాలీగా తరలివచ్చి సంఘీభావం తెలిపాయి. ధర్నాకు హాజరైన ఉద్యోగులకు రెవెన్యూ అసోసియేషన్ తరపున టి. సునీల్ రెడ్డి టీ, స్నాక్స్, వాటర్ బాటిళ్లు అందించారు.

కార్యక్రమంలో టి.జి. జాక్ నాయకులు టి. సునీల్ రెడ్డి, పారుపల్లి నాగేశ్వరరావు, కట్ట శేఖర్, రంగారావు, రాయల నరసింహారావు, ఎస్.కే. రంజాన్, దుర్గా భవానీ, రాజేష్, విజయ్, వెంగలరావు, మోదుగు వేలాద్రి, కొణిదేన శ్రీనివాస్, ఎం. సుబ్బయ్య, టి. వేణు, వీరస్వామి, మల్లెల రవీంద్ర ప్రసాద్, యలమద్ది వెంకటేశ్వర్లు (వై.వి.), బిక్కు, వెంకట రమణ, వెంకటేశ్వర్లు, వేంకటపతి రాజు, ధరావత్ రాములు, మట్టా శ్రీనివాస్, సింగారపు వేణు, నాగిరెడ్డి, కరంచంద్, పరిష పుల్లయ్య, శేషు ప్రసాద్, పుష్ప రాజ్, రాంబాబు, ఉషశ్రీ, సుధారాణి, విజయకుమారి, జెడ్.ఎస్. జైపాల్, తాళ్లూరి శ్రీకాంత్, కొమరగిరి దుర్గాప్రసాద్, వల్లపు వెంకన్న, బి. చంద్రశేఖర్, ఎర్ర రమేష్, బెజ్జంకి ప్రభాకరాచారి, కోటపాటి రుక్మారావు, అశ్లాం, జిలాని, గఫూర్, మృదుల, రాధికా రెడ్డి, లలితకుమారి, విజయ, శ్రీధర్ సింగ్, వీరన్న, ప్రసాద్, నాగుల్ మీరా, గురుమూర్తి, కోమలి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల న్యాయమైన సమస్యలకు పరిష్కారం లభించే వరకు ఐక్యత, సమన్వయం, క్రమశిక్షణతో ప్రజాస్వామ్య పద్ధతిలో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని టి.జి. జాక్ నాయకులు స్పష్టం చేశారు.





# ఫీజు బకాయిలపై యువ మోర్చా ఆగ్రహం - రాస్తారోకో

**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 27 (భద్రాద్రి న్యూస్) :** భారతీయ జనతా పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు, యువ మోర్చా ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం అమరవీరుల స్తూపం--బస్టాండ్ సెంటర్ వద్ద ఫీజు బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నిరసన కార్యక్రమం మరియు రాస్తారోకో నిర్వహించారు. ఈ నిరసనకు యువ మోర్చా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు శ్రీ జుజ్జూరు మోహన్ కృష్ణ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా యువ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీ జుజ్జూరు మోహన్ కృష్ణ మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి డా. జాటోత్ వెంకన్న నాయక్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు 15 వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ బకాయిల వల్ల వేలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, రాష్ట్రంలోని ప్రతి ఒక్క విద్యార్థికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. 15 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించకపోతే యువ మోర్చా ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు ఉగ్రరూపంలో చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐటీ కన్వీనర్ భీమల్ జైన్, బలగం శ్రీధర్, చుంచుపల్లి మండల నాయకులు, పాల్వంచ టౌన్ అధ్యక్షులు రాపాక రమేష్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు వీర ప్రతాప్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి స్వప్న, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మంగీలాల్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి రాజ్, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు మహంకాళి శంకర్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోల హరీష్, జిల్లా ఉపాధ్యక్షులు పొదిల్లా శ్రీను, మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి బాలసాని శివ, జిల్లా కార్యదర్శి



ధారావత్ నరేష్, భద్రాద్రి జిల్లా కార్మిక సెల్ కన్వీనర్ గుమలాపురం సత్యనారాయణ, చుంచుపల్లి మండల ప్రధాన కార్యదర్శి బుర్ర సతీష్ కుమార్, యువ మోర్చా కార్యవర్గ సభ్యులు హరి ప్రసాద్, పాల్వంచ టౌన్ జనరల్ సెక్రెటరీ బానోత్ కుమార్, తాటికొండ కళ్యాణ్, బట్టు శివ, భూక్య మోహన్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో తగ్గుతున్న కార్మికుల సంఖ్య..

# వెలవెలబోతున్న కార్మికవాడలు

**- కొత్త నియామకాలు లేక, గనుల మూతతో ప్రశ్నార్థకంగా మారుతున్న ఏరియాల భవిష్యత్**



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 27 (భద్రాద్రి న్యూస్) :** ఒకప్పుడు బొగ్గు గనులు, వేలాది మంది కార్మిక కుటుంబాలతో కళకళలాడిన సింగరేణి ప్రాంతాలు నేడు కార్మికుల కొరతతో వెలవెలబోతున్నాయి. ఓ వైపు బొగ్గు గనులు క్రమంగా మూతపడుతుండగా.. మరోవైపు సింగరేణి యాజమాన్యం కొత్త నియామకాలు చేపట్టకపోవడంతో కార్మికవాడలు బోసిపోతున్నాయి. గనుల మూతతో ఇంతకాలం పనిచేసిన కార్మికులు ఇతర ప్రాంతాలకు తరలిపోతుండటంతో పలు ఏరియాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకప్పుడు సింగరేణిలో ఉద్యోగం అంటేనే భయపడే పరిస్థితి ఉండేది. బొగ్గు గనుల్లో పనిచేయడానికి చాలామంది వెనుకంజ వేసేవారు. అయితే కాలక్రమంలో సింగరేణి సంస్థ వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించే సంస్థగా రూపాంతరం చెందింది. బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు అప్పటి డైరెక్టర్ జీపీ రావు నేతృత్వంలో పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టారు. ఆ సమయంలో కార్మికుల ఎంపికలో పరుగు పందెం వంటి పోటీలు నిర్వహించడంతోపాటు, అంతకుముందు బరువులు ఎత్తే సామర్థ్యం ఆధారంగా కూడా ఉద్యోగాలు కల్పించేవారు. 1985 ప్రాంతంలో రన్నింగ్ ద్వారా ఒకేసారి సుమారు 40 వేల మందిని నియమించిన సందర్భం ఉంది. దీంతో సింగరేణిలో కార్మికుల సంఖ్య భారీగా పెరిగింది. అయితే కాలక్రమంలో బొగ్గు ఉత్పత్తి పెరిగినప్పటికీ కార్మికుల సంఖ్య మాత్రం క్రమంగా తగ్గుతూ వచ్చింది. సంస్థలో అవసరానికి మించి కార్మికులు ఉన్నారనే కారణంతో యాజమాన్యం వివిధ పద్ధతుల్లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించే చర్యలు చేపట్టింది. గోల్డెన్ షేక్‌హ్యాండ్ పథకం ద్వారా సర్వీసు పూర్తికాకముందే పలువురు కార్మికులు ఉద్యోగాల నుంచి వైదొలిగే పరిస్థితి ఏర్పడింది. దీంతో సింగరేణి వ్యాప్తంగా కార్మికుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఒకప్పుడు లక్షకు పైగా కార్మికులు పనిచేసిన సింగరేణి సంస్థలో ప్రస్తుతం ఆ సంఖ్య సుమారు 40 వేలకు చేరుకుంది. అన్ని ఏరియాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గత ఐదేళ్లలో కార్మికుల సంఖ్య ఎన్నడూ లేనంత వేగంగా తగ్గినప్పటికీ కొత్త నియామకాలపై యాజమాన్యం పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త నియామకాలు లేకపోవడం, సీనియర్ కార్మికులు పదవీ విరమణ చేయడం, కొన్ని గనులు మూతపడటం వంటి పరిణామాలతో కార్మికుల సంఖ్య మరింత తగ్గుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో సింగరేణి ప్రాంతాల్లోని అనేక కార్మికవాడలు పూర్తిగా వెలవెలబోయే ప్రమాదం ఉందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ ప్రాంత పరిధిలోని సింగరేణి శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల్లోనూ కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఐదేళ్ల క్రితం ఈ మూడు ఏరియాల్లో కలిపి సుమారు 21 వేల మంది వరకు కార్మికులు ఉండగా.. ప్రస్తుతం 14 వేల మందికి పైగా మాత్రమే విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. రాబోయే ఐదేళ్లలో మరిన్ని గనులు మూతపడితే కార్మికుల సంఖ్య మరింత తగ్గిపోయే అవకాశం ఉంది. కొత్త నియామకాలు చేపట్టకపోతే అనుభవజ్ఞులైన కార్మికుల స్థానంలో కొత్త తరం సిబ్బంది లేకపోవడం సంస్థ భవిష్యత్ నిర్వహణపై ప్రభావం చూపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గనులు నడిచిన కాలంలో కార్మిక కుటుంబాలతో కళకళలాడిన సింగరేణి కాలనీల్లో ప్రస్తుతం జనసంచారం తగ్గుతోంది. గనులు మూతపడటం, ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు తరలిపోవడం, కొత్త నియామకాలు లేకపోవడంతో పాఠశాలలు, మార్కెట్లు, చిన్న వ్యాపారాలు, ఇతర వాణిజ్య కార్యకలాపాలపైనా ప్రభావం పడుతోంది. సింగరేణి సంస్థకు కొత్త గనులు, కొత్త ఉపాధి అవకాశాలు, అవసరమైన చోట కొత్త నియామకాలు



చేపట్టడంతోపాటు మూతపడుతున్న గనుల ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను కల్పించాల్సిన అవసరం ఉందని కార్మికులు, స్థానికులు కోరుతున్నారు. లేకపోతే ఒకప్పుడు కార్మికుల కష్టంతో వెలుగొందిన సింగరేణి ప్రాంతాలు భవిష్యత్తులో క్రమంగా జనరహిత ప్రాంతాలుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

# తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అర్హులందరికీ రేషన్ కార్డులు

**- కృష్ణాపురం గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**



**మధిర:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని కృష్ణాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు అన్నారు. మధిర మండలం కృష్ణాపురం గ్రామంలో గురువారం పంచాయతీ కార్యాలయంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ భూక్య నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు చేతుల మీదుగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.

# వృక్ష రక్షా బంధన్ నిర్వహించిన ఎర్రగుంట పాఠశాల విద్యార్థులు



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 27 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ఉపాధ్యాయులతో కలిసి వృక్ష రక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఎకో క్లబ్, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలోని రావి చెట్టుకు ఆకులు, పువ్వులతో చేసిన రాఖిని కట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ మాట్లాడుతూ... సోదర, సోదరీమణులు జరుపుకునే ముఖ్యమైన పండుగ రాఖి పండుగ అని, ఆ రాఖీ తమ సోదరులకు రక్షణ గా ఉంటుందని అక్క, చెల్లీల అపార నమ్మకానికి ప్రతీక అని అన్నారు. ప్రతీ సంవత్సరం తమ పాఠశాలలో చెట్లకు రాఖీలు కట్టడం ద్వారా ఈ పండుగని జరుపుకోవడం జరుగుతుందని తెలియజేసారు. చెట్లను తమ సోదరులుగా భావిస్తూ అవి కలకాలం పచ్చగా ఉండి మనకు అన్ని విధాలుగా సహాయ పడతాయని ఆకాంక్షిస్తూ రాఖి కట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఇంచార్జి సునంద రెడ్డి, ఎకో క్లబ్ ఇంచార్జి మొత్కూరి పద్మ, ఉపధ్యాయులు బాబురావు, వెంకటేశ్వర రావు, వసంత, మోతిలాల్, జయరాం, ప్రసాద్, పాఠశాల కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు, శిరీష, ఖాసీం, ఎకో క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు. అంతే కాక అందరూ రాఖి పండుగను సుఖ శాంతులతో జరుపుకోవాలని మండల విద్యాశాఖాధికారి అన్నపురెడ్డిపల్లి ప్రజలందరికి శుభాకాంక్షలు తెలియజేసారు.

# చైతన్య పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు...



**పాల్వంచ, ఆగస్టు27 (భద్రాద్రి న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెంలోని శ్రీ చైతన్య పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు ముందస్తు అత్యంత కోలాహలంగా, ఆనందోత్సాహాల మధ్య గురువారం జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల చిన్నారులు ఒకరికొకరు రాఖీలు కట్టి, తీపి తినిపించుకుంటూ తమ ప్రేమ అనురాగాన్ని చాటుకున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు అన్నా చెల్లెళ్ల ప్రేమానురాగాలు, రక్షణ భావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు తెలిపారు. చిన్నారుల ముద్దుల రాఖీ ముచ్చట్లు, వారి చిరునవ్వులు పాఠశాలలో పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాణి, ఉపాధ్యాయులు చందన, భవాని, జనిత, భావన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబరు 1న ఐఎఫ్టియు జిల్లా సదస్సును జయప్రదం చేయండి.




**గుండాల ఆగస్టు 27 భద్రాద్రి న్యూస్;** వచ్చేనెల ఒకటవ తారీఖున IFTU జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగే సదస్సును జయప్రదం కోరుతూ గురువారం కాచనపల్లి లో జరిగిన ప్రచార కార్యక్రమంలో IFTU జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి పాల్గొని మాట్లాడుతూ సంఘటిత,అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని, హమాలి మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులకు నెలకు 26వేల జీతం పెంచి ప్రతి నెల ఒకటో తారీఖున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు నెలకు పదివేల రూపాయల జీవనభృతి కల్పించాలని డిమాండ్ చేశారు.ఐఎఫ్టియు గుండాల ఏరియా కమిటీ నాయకులు అటికం శేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు యనగంటి లాజర్, యనగంటి చిరంజీవి, మల్టీపర్పస్ కార్మికులు తాళ్లపల్లి ముత్యం, ఎరుకల సురేష్, రాపోలు కృష్ణ, హమాలి కార్మికులు ట్రాక్టర్ల డ్రైవర్లు రవి ,దుర్గారావు రాందాస్, రాములు, విక్రమ్, పరుశురాం, సంపత్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు

# మంత్రి పొంగిలేటికి రాఖీ కట్టిన బొర్రా ఉమాదేవి



**వైరా, ఆగస్టు 27, (భద్రాద్రి న్యూస్) :** ఖమ్మం జిల్లా పట్టణంలో రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఖమ్మంలో మాజీ జెడ్పిటిసి, వైరా మున్సిపల్ కౌన్సిలర్ బొర్రా ఉమాదేవి గురువారం రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మంత్రి పొంగిలేటిని కలిసి రాఖీ కట్టడం ఆనందంగా ఉందని ఉమాదేవి పేర్కొన్నారు. మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ రక్షాబంధన్ పండగ సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆత్మీయత, అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని, సమాజంలో ఐక్యత, సోదర భావం మరింత పెంపొందించాలని, నేటి సమాజంలో మానవతా విలువలు క్షయణించిపోతున్నాయని, ఇలాంటి రక్షాబంధన్ పండుగల వల్ల రక్తసంబంధీకుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు బలపడతాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర మార్క్ ఫైడ్ వైస్ చైర్మన్ బుర్ర రాజశేఖర్, మాజీ వైరా మున్సిపల్ చైర్మన్ సూతగాని జైపాల్, నాయకులు కోసూరి శ్రీనివాసరావు, రాయల పుల్లయ్య, దొడ్డ నగేష్, బోడ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగిలేడి శ్రీనివాస్ రెడ్డికి పలువురు నాయకులు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# వైద్య సాయానికి ఎమ్మెల్యే జారే చొరవ.. 78 సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులు అందజేత



**దమ్మపేట, ఆగస్టు 27:భద్రాద్రి న్యూస్:** అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా ఆర్థిక సాయం అందేలా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చొరవ తీసుకున్నారు. ఈ మేరకు 78 సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎంఆర్ఎఫ్ కార్యాలయ ప్రతినిధికి ఎమ్మెల్యే జారే అందజేశారు. అర్హులైన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా దరఖాస్తుల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందుతున్నందుకు పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# అధిక వడ్డీలకు అడ్డుకట్ట..

## - రుణాల పేరుతో వేధిస్తే కఠిన చర్యలు

## - జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్




**భద్రాద్రి న్యూస్ , దమ్మపేట ఆగస్టు 27:** ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి, అనంతరం రుణ గ్రహీతలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ప్రజల ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలకు రుణాలు ఇచ్చి, అధిక మొత్తాలు వసూలు చేస్తూ ఇబ్బందులకు గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని తెలిపారు. రుణాలు చెల్లించలేని పరిస్థితుల్లో ప్రజలను బెదిరించడం, వేధింపులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అధిక వడ్డీల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

# ముచ్చర్ల అంగనవాడి ఒకటవ సెంటర్ కు పైపులైను వేయించిన గ్రామ సర్పంచ్ లుసి





**కామేపల్లి,ఆగస్టు 27 (భద్రాద్రి న్యూస్):-** కామేపల్లి మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామపంచాయతీ లో నిర్వహిస్తున్న ఒకటవ అంగన్వాడి సెంటర్ కు మంచి నీళ్ల వసతి సరిగా లేక పిల్లలు టీచరు ఆయా ఇబ్బందులు పడుతూ ఉంటే చూడలేక మానవ దృక్పథంతో చెల్లించి మంచి నీళ్లు దూరం నుండి బిందెలలో తీసుకొస్తుంటే చూసి తెలిసి వెంటనే వారి ఇబ్బందులను గుర్తించి గ్రామ సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ గురువారం పైపులైను0 ఒకటో అంగన్వాడి సెంటర్లో వేయించారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ ఎస్ ఐ ఆర్ గ్రామంలో సర్వే చేసి ఓటర్ల మార్పులు చేర్పులు చనిపోయిన వాళ్ళ పేర్లు తొలగించడంతో పాటు పేరు నమోదు చేసుకున్నవారు ఓటర్ లిస్టులో పేరు ఉందా లేదా అనే దానిపై చూసుకోవాలని వారు ఓటర్లకు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ సూపర్వైజర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ బత్తిని సత్యం అన్న ఆశయాలు సాధిద్దాం




**గుండాల, ఆగస్టు 27,భద్రాద్రి న్యూస్ :** మండల పరిధిలో కాచనపల్లి గ్రామంలో బత్తిని సత్యం అన్న సంతాప సభ జరిగిందిఈ సభను ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ,CPI(ML) న్యూ డెమోక్రసీ ఇల్లందు డివిజన్ కమిటీ సభ్యులుగా, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులుగా పనిచేస్తూ క్యాన్సర్ వ్యాధితో కొంతకాలం పోరాడి ఈనెల 20వ తారీకున మరణించాడని గత 30 సంవత్సరాలుగా పీడిత తాడిత ప్రజల కోసం ఈ ప్రాంతంలోని ప్రజల అభివృద్ధి కోసం ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడ్డ ఆదివాసీ ప్రజల కోసం ఆదివాసీ గుడాలల్లో తిరుగుతూ ఈ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని ఫారెస్ట్ వారి దౌర్జన్యానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలలో కీలక పాత్ర పోషించారు. న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో పోడు భూములు నరికించిన దానిలో కామ్రేడ్ బత్తిని సత్యం అన్న పాత్ర స్థిరస్థాయిగా నిలుస్తుందని రైతాంగ సమస్యలు భూమి సమస్య నిరుద్యోగ సమస్య ధరల పెరుగుదల దళితులు, గిరిజనుల హక్కులు మహిళలపై హింస వంటి సామాజిక సమస్యలపై కామ్రేడ్స్ బత్తిని సత్యం అన్న పోరాడారని పేద ప్రజల బాధలు తన బాధలుగా భావించి కామ్రేడ్ సత్యం అన్న పని చేశారని ఈ ప్రాంత ప్రజల తలలోని నాలుకలాగా నీటిలోని చేపలాగా పనిచేస్తూ మంచి పేరు సంపాదించుకున్నాడని ప్రజల మనిషిగా నిలిచాడని పేదల పక్షపాతిగా నిలబడ్డాడని డెమోక్రసీ దళాలకు అండగా నిలిచి వాటిని ఈ ప్రాంతంలో కంటికి రెప్ప లాగా కాపాడే కృషి చేశాడని ఈ క్రమంలో అనేక నిర్బంధాలు కేసులను ధైర్యంగా ఎదుర్కొని ముందు నడిచాడని ఉద్యమమే ఊపిరిగా ప్రజా క్షేత్రంలో నిలకడగా ఉంటూ పేదలను తరుముతున్న ఆర్థిక రాజకీయ అసమానతలను ప్రతిఘటించకుండా భవిష్యత్తు లేదని సమాజాన్ని గ్రహించాడు ప్రతిఘటన ఉద్యమానికి సన్నద్ధ చేసే కృషిలో తుది శ్వాస వరకు నిలబడ్డాడు మంచి కమ్యూనిస్టుగా కమ్యూనిస్టు నీతి కి నిదర్శనం గా,ప్రజాహితాన్ని కోరే మనిషిగా నిస్వార్థపరంగా నిజాయితీ తన సొంత శీ.పట్టుదల నిబద్ధత క్రమశిక్షణ కు చిరునామాగా పార్టీ సీలికల సందర్భంగా సరైన రాజకీయాలను కొనసాగిస్తున్న న్యూ డెమోక్రసీతో నిలబడ్డాడు కామ్రేడ్ బత్తిని సత్యం అకాల మరణం పీడిత ప్రజలకు విప్లవోద్యమానికి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీకి తీరని నష్టంఅని కామ్రేడ్ బత్తి ని సత్యం అన్న ఆశయాలను,లక్ష్యాలను సాగించడం ఆయన ఎత్తిన ఎర్రజెండాను చివరికంటా చేబు ని తుది శ్వాస వరకు ముందుకు సాగడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు పి ఐ ఎం ఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు కామ్రేడ్ పూణెం రంగన్న ఇల్లెందు డివిజన్ నాయకులు బొర్రా వెంకన్న కాచన పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ జ రుపు ల కిషన్,పార్టీ గ్రామ సహాయ కార్యదర్శి పూనెం సత్యం పిలుపునిచ్చారు వచ్చే నెల మూడో తారీకున సత్యం అన్న స్వగ్రామం ఆళ్లపల్లి మండల కేంద్రంలో జరిగే సంతాప సభను జయప్రదం చేయాలని కోరారు కాంచనపల్లి గ్రామ కార్యదర్శి అటికం శేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పి వై ఎల్ ఆళ్లపల్లి మండల కార్యదర్శి యనగంటి లాజర్, అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శియన గంటి చిరంజీవి,జగ్గు తండా గ్రామ కార్యదర్శి ఇస్లావత్ రామదాసు,ఏఐకేఎంఎస్ మండల నాయకులు బొమ్మర వీరన్న, శ్రీను, ఇస్లావత్ శివశంకర్,ఊకే, కౌసల్య, ధనమ్మ యువకులు, మహిళలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా సాంస్కృతిక పోటీలు

- ఈ పోటీలలో సుమారు 30 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు
- పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు చైర్ పర్సన్ కాపా చంద్రకళ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు







**వైరా, ఆగస్టు 27,( భద్రాద్రి న్యూస్ ) :** వైరా నియోజకవర్గ పట్టణ పరిధిలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్యాంపస్ లో మండల స్థాయి సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థుల క్రీడా సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైరా మున్సిపల్ పట్టణ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, విశిష్ట అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీ. జి. మాధవరావు, బాలికొన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరి, ఎం. పి. పి. ఎస్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు అఫ్జల్ హాజరై విద్యార్థినుల అభినందించారు. ఈ పోటీలలో సుమారు 30 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు, జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ శిరీష, సి డబ్ల్యూ ఎస్ ఎన్ ప్రత్యేక ఉపాధ్యాయులు శ్రీ రవి, శ్రీమతి అజిత, శ్రీమతి శ్రావణి, ఫిజియోథెరపీ టీచర్ వసంత విద్యార్థులను ప్రోత్సహిస్తూ పోటీలను సమర్థవంతంగా నిర్వహించారు. పోటీలు అనంతరం వివిధ విభాగాల్లో మండల స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించడం జరిగింది . ఈ సందర్భంగా విజేతలు తదుపరిస్తాయి పోటీలలో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని అతిథులు ఆకాంక్షించారు. సి. డబ్ల్యూ ఎస్. ఎన్.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇటువంటి క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు పేర్కొన్నారు.

# దమ్మపేటలో ముమ్మరంగా డిజిటల్ క్రాప్ సర్వే



**భద్రాద్రి న్యూస్ -- దమ్మపేట ఆగస్టు 28:** దమ్మపేట మండలంలో వానాకాలం--2026 పంటల నమోదు కోసం డిజిటల్ క్రాప్ సర్వే (DCS) ప్రక్రియను వ్యవసాయ శాఖ ముమ్మరం చేసింది. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమైన సర్వేను గ్రామాల్లో సర్వే వాలంటీర్ల ద్వారా ఏఈఓల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. రైతులు సాగు చేస్తున్న పంట, విస్తీర్ణం, భూమి వివరాలను ఉపగ్రహ ఆధారిత జియో-ట్యాగింగ్‌తో డిజిటల్‌గా నమోదు చేస్తున్నారు. రైతు పేరు, భూమి సర్వే నంబర్, సాగు విస్తీర్ణం, పంట రకం, సాగు కాలం, నీటి వనరు తదితర వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా వాస్తవ సాగు విస్తీర్ణం, పంటల వివరాలపై ఖచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, పంటల కొనుగోళ్లు, పంట నష్టం--బీమా, ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల అవసరాల అంచనాకు ఈ డేటా ఉపయోగపడనుంది.

ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలైన మినుము, పెసర, కంది, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. రైతులు తమ సమీప ఏఈఓలను సంప్రదించి డిజిటల్ క్రాప్ సర్వే పూర్తయ్యేలా సహకరించాలని కోరారు. క్షేత్ర పరిశీలనలో ఏఈఓలు వినోద్ కుమార్, అను బాబు, సర్వే వాలంటీర్లు, మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు రవి కుమార్ పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు పోలీస్ ఉద్యోగాలపై ఉచిత శిక్షణ...






**పాల్వంచ ,ఆగస్టు27 (భద్రాద్రి న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ టౌన్, మరియు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులకు పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ, ఉచిత వసతి కల్పించనున్నట్లు పాల్వంచ టౌన్ ఎస్సై టి నాగరాజు, రూరల్ ఎస్ఐ బి. సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ శ్రీ రోహిత్ రాజ్, ఐపీఎస్ సూచనల మేరకు నూతనంగా వెలువడనున్న పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు అభ్యర్థులను సిద్ధం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు ఫారమ్‌ను పూర్తి చేసి ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు పాల్వంచ టౌన్ మరియు రూరల్ పోలీస్ స్టేషన్‌లో సమర్పించాలని అధికారులు సూచించారు. అభ్యర్థులకు సెప్టెంబర్ 6న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు ఉచిత రెసిడెన్షియల్ సౌకర్యం కల్పించి, పోలీస్ పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్ఐలు తెలిపారు. పాల్వంచ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీస్ ఉద్యోగాల లక్ష్యాన్ని సాధించాలని ఆయన కోరారు.

# చేయూత' లో వృద్ధులపై ప్రభుత్వానికి వివక్ష ఎందుకు?

## - తెలంగాణ రైతుకూలీ సంఘం

## - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.పున్నంచంద్




**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 27 (భద్రాద్రి న్యూస్) :** వయసు పైబడి కడుపున పుట్టిన బిడ్డలు పట్టించుకోక ఆపన్నహస్తం కోసం ఎదురుచూసే పండుటాకుల (వృద్ధులు)పై 'చేయూత' విషయంలో ప్రభుత్వానికి వివక్ష ఎందుకని తెలంగాణ రైతుకూలీ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.పున్నంచంద్ ప్రశ్నించారు. గురువారం ఆయన మాట్లాడుతూ... చేయూత పథకంలో పింఛనుకై దరఖాస్తు చేసుకునేందుకు వయసు పైబడి వృద్ధులకు అవకాశం కల్పించకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.4వేలు ఇస్తామని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చాక పింఛన్లకు అన్నివర్గాలను దరఖాస్తు చేసుకోమని వృద్ధులను మాత్రం ఈ పథకానికి దూరం చేయడం తగదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల మందికి చేయూత పథకంలో అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించి వృద్ధులు నాలుగు లక్షల మంది ఉన్నారన్న అంచనాతో వారిని పక్కనపెట్టడం సమంజసం కాదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయన్నారు. నాలుగేళ్లుగా కొత్త పింఛన్లు ఇవ్వకపోవడంతో ఆశావహుల జాబితా పెరిగిందని, ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఫించన్ దరఖాస్తుల ఫారాల్లో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులు, డయాలసిస్, ఫైలేరియా బాధితుల వారికి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారని, కానీ జిల్లా వ్యాప్తంగా 30వేల వరకు ఉన్న వృద్ధులను చేయూత పథకానికి దూరం చేయడంపై ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఇప్పటికైనా వృద్ధులకు చేయూత పథకంలో కొత్తగా అవకాశం కల్పించి తాజాగా మంజూరు చేసే లబ్దిదారులతో పాటు వారికిఅవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

# కొత్తగూడెం 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు

## - డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు




**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 27 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం 3వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేసి, వారిని గౌరవనీయ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మత్తు పదార్థాల వినియోగం నుంచి వారిని బయటకు తీసుకువచ్చి, సాధారణ జీవన విధానంలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో గౌరవనీయ మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వారిని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ ఇంద్రసేన రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ, యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలని, వారి ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల విక్రయం, సరఫరా, రవాణా, వినియోగానికి పాల్పడే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని కేవలం శిక్షించడం మాత్రమే కాకుండా, అవసరమైన సందర్భాల్లో చికిత్స, పునరావాసం అందించడం ద్వారా వారిని తిరిగి సాధారణ జీవన విధానంలోకి తీసుకురావడానికి పోలీస్ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ విక్రయం, సరఫరా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్‌హెచ్‌ఓ ఇంద్రసేన రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# మతితప్పి మాట్లాడుతున్న కందాళ ఉపేందర్ రెడ్డి

- పాలేరు రిజర్వాయర్ ను డ్రింకింగ్ వాటర్ కోసం వినియోగించాలన్నది ఎవరో మర్చిపోయావ
- నీ రాజకీయ అవసరాల కోసం మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- Brs పార్టీ మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి పై ధ్వజమెత్తిన కొడాలి గోవింద రావు

**నేలకొండపల్లి, ఆగస్టు 27 (భద్రాద్రి న్యూస్) :** నేలకొండపల్లిలో జరిగిన BRS పార్టీ సమావేశంలో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అవాకులు,చెవాకులు పేలడాన్ని తీవ్ర స్థాయిలో ఖండించారు కాంగ్రెస్ పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు కొడాలి గోవింద రావు.గత పదేళ్ల దీ=వా పాలనలో తెలంగాణ పరిస్థితి ఏ విధంగా ఉందో చూసుకోవాలని హితవు పలికారు. ఎలినినో కారణంగా వర్షాలు రాక రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని ముందు నుంచి ప్రభుత్వం రైతులను అప్రమత్తం చేస్తుందని ఆయన అన్నారు.బ్యాలెన్సింగా ఉన్న పాలేరు రిజర్వాయర్ ను త్రాగునీటి కోసం వినియోగించడం కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్,ఖమ్మం సూర్యాపేట,మహబూబ్ బాద్ జిల్లాలకు మిషన్ భగీరథ ద్వారా త్రాగునీరు కోసమే వినియోగించాలని చెప్పిన మాట మర్చిపోయిన కందాళ ఉపేందర్ రెడ్డి ఈనాడు సాగునీరు ఇవ్వాలని



మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. నోటికి వచ్చినట్లు మాట్లాడితే పాలేరు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఆయన తెలిపారు. ఒకసారి ఉపేందర్ రెడ్డి కి బుద్ధి చెప్పారని మళ్లీ పాలేరు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు

# మాదారం పెద్ద చెరువు అలుగు బ్రిడ్జికి ముప్పు

- శిథిలావస్థలో బ్రిడ్జి.. కట్ట రోడ్లు అధ్వానం

**కారేపల్లి, ఆగస్టు 27(భద్రాద్రి న్యూస్ రాములు ):** మాదారం గ్రామపంచాయతీ పరిధిలోని పెద్ద చెరువు అలుగు బ్రిడ్జి తీవ్రంగా దెబ్బతిని ప్రమాదకరంగా మారిందని, చెరువు కట్టపై రహదారులు సైతం అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిడ్జికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, అవసరమైతే కొత్త నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సింగరేణి మండలం మాదారం, గుంపెల్లగూడెం గ్రామపంచాయతీల పరిధిలోని పెద్ద చెరువు అలుగు బ్రిడ్జి, కట్ట రోడ్లను సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ మండల కమిటీ బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి టి. ఝాన్సీ మాట్లాడుతూ, అలుగు బ్రిడ్జి పరిస్థితి రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉందని, వర్షాకాలంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే బ్రిడ్జికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, మరమ్మతులు సాధ్యం కాని పరిస్థితిలో కొత్త బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చెరువు కట్టపై ఉన్న రహదారులు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని కట్ట రహదారిని వెంటనే డాంబర్ లేదా సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సమస్యపై మాదారం, గుంపెల్లగూడెం గ్రామపంచాయతీల ప్రజాప్రతినిధులు, సింగరేణి నియోజకవర్గ ఎమ్మెల్యే బానోత్ రాందాస్ నాయక్, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నిర్మాణ పనులు చేపట్టాలని టి. ఝాన్సీ డిమాండ్ చేశారు. సమస్యను నిర్లక్ష్యం చేసి కాలయాపన చేస్తే వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బ్రిడ్జి,



రహదారుల సమస్యను పరిష్కరించకపోతే స్థానిక ప్రజలను సమీకరించి సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గూగుల్ తేజ నాయక్, సంయుక్త మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, సహాయ కార్యదర్శి ఎన్.వి. రాకేష్, మండల నాయకులు పులకాని సత్తి రెడ్డి, రావుల నాగేశ్వరరావు, కోయిల శ్రీనివాస్ తదితరులతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గా దేపాడులో ఎస్ఐఆర్‌పై గ్రామసభ

- సర్పంచ్ భూక్యా రంజిత్‌కుమార్ అధ్యక్షతన సమావేశం

**కారేపల్లి, ఆగస్టు 27(భద్రాద్రి న్యూస్ రాములు ):** సింగరేణి మండలం గదేపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ భూక్యా రంజిత్‌కుమార్ అధ్యక్షతన ఎస్ఐఆర్‌పై గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్యా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించి అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. బీఎల్ఓ శ్రీనివాసరావు నోటీసులు అందజేసిన వారు తమ కుల ధ్రువపత్రం లేదా తల్లి, తండ్రి కుల ధ్రువపత్రాన్ని అందజేయాలని కోరారు. అవసరమైన పత్రాలు సమర్పించడం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం బీఎల్ఓ శ్రీనివాసరావు గ్రామంలోని ఓటర్ల జాబితాలో ఉన్న పేర్లను చదివి వినిపించారు. గ్రామస్థులు తమ పేర్లు, వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించాలి గదేపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో ముసాయిదా ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని ప్రతి ఓటరు కార్యాలయానికి వచ్చి ముసాయిదా జాబితాలో తమ పేరు నమోదైందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు.

జాబితాలో పేరు లేని అర్హులైన వారు కొత్తగా ఫారం-6 దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతీ యువకులు ఆధార్ కార్డు, పదో తరగతి ధ్రువపత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు,



కుటుంబ సభ్యుల్లో ఒకరి ఓటర్ ఐడీ జిరాక్స్ ప్రతితో బీఎల్ఓను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని గ్రామసభలో సర్పంచ్, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నన్నెబోయిన ఉపేందర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్నేహశీలి రాయపాటి రవి మృతి బాధాకరం

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు

**కారేపల్లి, ఆగస్టు 27(భద్రాద్రి న్యూస్ రాములు ):** అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, అందరితో కలివిడిగా మెలిగిన స్నేహశీలి రాయపాటి రవి మృతి బాధాకరమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. గాంధీనగర్ గ్రామంలో గురువారం నిర్వహించిన రాయపాటి రవి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాయపాటి రవి మృదుస్వభావి, స్నేహశీలి అని, అందరితో ఆప్యాయంగా మెలిగేవారని గుర్తుచేశారు. సుమారు ఆరేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవి, అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం విషాదకరమన్నారు. రోడ్డు ప్రమాదం అనంతరం రవి వైద్యానికి కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా ఎంతో శ్రమించారని తెలిపారు. అయినప్పటికీ పూర్తిగా కోలుకోక మృతి చెందడం కుటుంబానికి తీరని లోటని అన్నారు. రవి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి ధైర్యం చెప్పారు. కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి

దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడిన రవి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కుటుంబ పరిస్థితిని పరిశీలించి, అర్హత మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మృతుడు రవికి తల్లి పద్మ, భార్య అనంతలక్ష్మి, కుమారుడు సాయి ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కే. నరేంద్ర, మండల కమిటీ సభ్యులు కేసగాని ఉపేందర్, మన్నేపల్లి




పద్మ, న్యాయవాది ఎస్. వెంకటనర్సయ్య, శ్రీనిధి జగన్, గ్రామ పెద్దలు కర్నాటి ఆనందరావు, కేసగాని రామ్మూర్తి, కాపా చంద్రశేఖర్, పెనక సత్యం, కళ్యాణపు శ్రీనివాసరావు, కాప ప్రభాకర్, కర్నాటి సీతారాములు, భాస్కర్, సింగు వెంకటేశ్వర్లు, పోలూరి రామారావు, గడిపర్తి వీరభద్రం, అడప పుల్లారావు, బత్తుల శ్రీనివాసరావు, నామ బుచ్చయ్య, భూక్య రంగారావు, చావా శ్రీనివాసరావుతో పాటు బంధుమిత్రులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొని రాయపాటి రవికి నివాళులర్పించారు.

# భాగ్యనగర్ తండాలో ఓటరు సవరణపై గ్రామసభ

- సర్పంచ్ బానోత్ హీరాలాల్ అధ్యక్షతన సమావేశం

**కారేపల్లి, ఆగస్టు 27(భద్రాద్రి న్యూస్ రాములు ):** భాగ్యనగర్ తండా ఆగస్టురాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఓటరు సవరణ రెండో దశ కార్యక్రమంలో భాగంగా భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో గురువారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ బానోత్ హీరాలాల్ అధ్యక్షతన జరిగిన సభలో ఓటరు జాబితా సవరణ, కొత్తగా పేర్ల నమోదు, అభ్యంతరాలు, మార్పులు చేర్పులపై గ్రామస్తులకు వివరించారు. పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ గత నెలలో గ్రామంలో నిర్వహించిన ఓటరు వివరాల పరిశీలన అనంతరం ప్రాథమిక ఓటరు జాబితా వెలువడిందని తెలిపారు. జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా సంబంధిత ఓటరు నమోదు సిబ్బందిని సంప్రదించి సరిచేసుకోవచ్చని చెప్పారు. గతంలో ఓటు నమోదు చేయించుకోని వారు కూడా అర్హత ఉంటే ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పద్దెనిమిది సంవత్సరాల వయస్సు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని అనిల్ కుమార్ సూచించారు. ఓటరు జాబితాకు సంబంధించి విచారణకు హాజరు కావాలని నోటీసులు అందుకున్న వారు నోటీసులో పేర్కొన్న తేదీల్లో అవసరమైన ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియ సజావుగా సాగేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామ నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సర్పంచ్ బానోత్ హీరాలాల్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి అర్హుడికి



ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా, గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో గ్రామపంచాయతీ ప్రజలకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో తమ పేరు, కుటుంబ సభ్యుల పేర్లు ఉన్నాయా లేదా అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, ఏవైనా పొరపాట్లు ఉంటే గడువులోగా సరిచేసుకోవాలని గ్రామసభలో సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుగులోత్ భిక్కులాల్, వార్డు సభ్యులు గాంధీ, కిషన్, ఓటరు నమోదు సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామంలో ప్రతి ఒక్కరు ఎస్ఐఆర్ లో ఓట్లు నమోదు చేయించుకోవాలి

-- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



**కామేపల్లి,ఆగస్టు 27 (భద్రాద్రి న్యూస్) :** ప్రతిఒక్కరు ఎస్ ఐ ఆర్ లో తమ ఓటర్ లిస్టులో నమోదు చేయించుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు కోరారు. మండలంలోని పింజరమడుగు గ్రామంలో రెండో విడత సర్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు కాంగ్రెస్ ఓబిసి జిల్లా అధ్యక్షులు. కామేపల్లి సొసైటి అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం మాట్లాడుతూ గ్రామాలలో ఓట్ల విషయం లోప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పింజరమడుగు గ్రామ సర్పంచ్ గూగులోత్ భాష. ఉప సర్పంచ్ నాగభూషణం.జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ ఫతే మహమ్మద్,జిల్లా కాంగ్రెస్ నాయకులు తోటకూరి శివయ్య,. బి ఎల్ ఎ పుట్టల వెంకటేష్ బి ఎల్ ఓ గంపల చిలకమ్మ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నల్లమోతు రవి గ్రామ పెద్దలు. ప్రజలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేలకొండపల్లి మండలంలో పలు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

నేలకొండపల్లి మండల నాచేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గోగుల శేఖర్, రాజ్యలక్ష్మి దంపతుల కూతురు వివాహ వేడుకకు మంత్రిగారు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి పట్టు వస్త్రాలను బహుకరించారు



ఈ వివాహ వేడుకకి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, నేలకొండపల్లి మాజీ సర్పంచ్ మామిడి వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షులు ఉండ్రా నాగప్రసాద్, మాజీ ఎంపీటీసీ మక్తాల రామకృష్ణ, గార్లపాటి లక్ష్మీనారాయణ, నాచేపల్లి మత్స్య సహకార సంఘం అధ్యక్షులు గోగుల శ్రీను, మందడి వెంకటేశ్వర్లు (చిన్న), కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# మాలోతు మంగీలాల్ మృతికి దిశా కమిటీ సభ్యురాలు హేమలత బాలాజీ, మాజీ సర్పంచ్ బద్రు నాయక్ సంతాపం

**కారేపల్లి, ఆగస్టు 27(భద్రాద్రి న్యూస్ రాములు ):** మాజీ సింగరేణి మండల తహసీల్దార్, ప్రస్తుతం హనుమకొండ ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న మాలోతు మంగీలాల్ మృతి పట్ల దిశా కమిటీ సభ్యురాలు, పోలంపల్లి గ్రామ సర్పంచ్ హేమలత బాలాజీ, మాజీ సర్పంచ్ దారావత్ బద్రు నాయక్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాలోతు మంగీలాల్ మృతి తీవ్ర విషాదకరమని పేర్కొన్నారు. సింగరేణి మండల తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేశారని గుర్తు చేసుకున్నారు. విధి



నిర్వహణలో ఆయన చూపిన సేవా భావం, అంకితభావం ప్రశంసనీయమని తెలిపారు. ఆయన మృతి కుటుంబ సభ్యులతో పాటు సహచర అధికారులు, ప్రజలు మరియు ఆయనతో అనుబంధం ఉన్న వారందరికీ తీరని లోటని అన్నారు. ఈ విషాద సమయంలో మృతుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాలోతు మంగీలాల్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ అపారమైన విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని హేమలత బాలాజీ, దారావత్ బద్రు నాయక్ ప్రార్థించారు.

# దాసు అంత్యక్రియల్లో పాడె మోసిన మాజీ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న

- మృతదేహానికి ఘనంగా నివాళులర్పించిన నాయకులు



**కారేపల్లి, ఆగస్టు 27 (భద్రాద్రి న్యూస్ రాములు):** కారేపల్లి మండల పరిధిలోని తవిసిబోడు గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు బర్మావత్ దాసు (62) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న తవిసిబోడుకు చేరుకుని దాసు మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో భాగంగా పాడెను మోసి తమ సానుభూతిని వ్యక్తం చేశారు. దాసు మృతి పట్ల పలువురు నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతదేహానికి సర్పంచ్ బానోత్ రాందాస్ నాయక్, మాజీ సర్పంచులు భూక్య రమణ, మంగ్య నాయక్, మాజీ ఎంపీటీసీ బానోత్ దల్‌సింగ్ నాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి అజ్మీర శివ నాయక్, కోటి నాయక్, బాబు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాసుతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన సేవలను నాయకులు స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## వడ్డె సందీప్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్



**కారేపల్లి, ఆగస్టు 27 (భద్రాద్రి న్యూస్ రాములు):** గార్ల, కృష్ణాపురంలో గురువారం నిర్వహించిన వివాహ రిసెప్షన్ వేడుకకు అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వరంగల్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న తన బీటెక్ మిత్రుడు వడ్డె సందీప్ వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులకు హృదయపూర్వక వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ దండు ప్రవీణ్ మాట్లాడుతూ.. నూతన దంపతుల వైవాహిక జీవితం ప్రేమానురాగాలు, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో నిండి ఉండాలని ఆకాంక్షించారు. జీవితాంతం పరస్పర అవగాహన, ఆప్యాయతలతో ఆనందంగా జీవిస్తూ కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. వడ్డె సందీప్ దంపతులకు సర్పంచ్ దండు ప్రవీణ్ ప్రత్యేకంగా వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

## కోదాడలో పోలీసుల నిజాయితీ:

### బస్సు ప్రమాద బాధితురాలి బంగారు చైన్ భద్రంగా అప్పగింత!



**కోదాడ, ఆగస్టు 27(భద్రాద్రి న్యూస్):** విధుల నిర్వహణలోనే కాదు.. మానవత్వం, నిజాయితీ చాటుకోవడంలోనూ తాము ఎల్లప్పుడూ ముందుంటామని కోదాడ పోలీసులు నిరూపించారు. కోదాడ మండలం దొరకుంట వద్ద బుధవారం జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో విజయవాడకు చెందిన మేరి జ్యోత్స్న అనే మహిళ మృతి చెందిన సంగతి తెలిసిందే.ఈ ప్రమాద సమయంలో కోదాడ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలంలో క్షతగాత్రులను కాపాడేందుకు, సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఈ క్రమంలో మృతురాలి పర్సులో ఉన్న విలువైన బంగారు చైన్‌ను పోలీసులు గుర్తించారు. ఆ చైన్‌ను ఏమాత్రం దురాశకు పోకుండా అత్యంత భద్రంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.పోలీస్ కానిస్టేబుళ్లు రాజేష్, ధనుంజయ్ చూపిన ఈ అసాధారణ నిజాయితీని కోదాడ రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ షేక్ యాకుబ్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రమాద సమయంలో విలువైన వస్తువులను భద్రపరిచి, బాధ్యతాయుతంగా ఉన్నతాధికారులకు అప్పగించిన పోలీసుల తీరుపై స్థానికులు, పలువురు ప్రముఖులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఆపత్కాలంలో పోలీసులు వ్యవహరించిన తీరు పోలీస్ శాఖకే గర్వకారణంగా నిలిచింది.

## నేషనల్ హైవేపై ప్రతి 30 కి.మీకు ఒక పెట్రోలింగ్ వాహనం ఉండాలి: రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్





**కోదాడ, ఆగస్టు 27(భద్రాద్రి న్యూస్ ):** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట గ్రామ శివారులో ఇటీవల జరిగిన ఘోర బస్సు ప్రమాద స్థలాన్ని తెలంగాణ రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ గురువారం పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును, దానికి గల కారణాలను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారులపై ప్రయాణికుల భద్రత అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు, తక్షణ సహాయక చర్యల కోసం ప్రతి 30 కిలోమీటర్లకు ఒక పెట్రోలింగ్ వాహనం నిరంతరం అందుబాటులో ఉంటూ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రహదారి భద్రతా నియమాలను కఠినంగా అమలు చేయాలని సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో సూర్యనారాయణ, రూరల్ ఎస్సై యాకుబ్, జిలానీ, దొరకుంట గ్రామ సర్పంచ్ పాలకి సురేష్‌తో పాటు పలువురు ఎన్హెచ్ఏఐ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తీజ్ పండుగ వేడుకలు అంబరాన్నంటిన సంబురాలు

- భాగ్యనగర్ తండాలో సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహణ..
- మహిళలు, తండా నాయకులు, గ్రామ పెద్దల సందడి





**సింగరేణి, ఆగస్టు 27 (భద్రాద్రి న్యూస్ రాములు):** సింగరేణి మండలం భాగ్యనగర్ తండా, చోళై తండాలో తీజ్ పండుగ వేడుకలు అంబరాన్నంటాయి. బంజారా సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించేలా మహిళలు, తండా నాయకులు, గ్రామ పెద్దలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. చోళై తండాలో బావుసింగ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ పండుగ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి, పాటలు పాడుతూ, నృత్యాలతో సందడి చేస్తూ పండుగ శోభను రెట్టింపు చేశారు. తీజ్ పండుగ బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. యువతరం సైతం తమ పూర్వీకుల ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తూ పండుగలో ఉత్సాహంగా పాల్గొనడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో తండా నాయకులు, మహిళలు, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొని తీజ్ పండుగను కన్నుల పండువగా నిర్వహించారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**కరీంనగర్ , ఆగస్టు 27:**





భారతదేశం పండుగలకు నిలయమని మరియు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకాని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ- టెక్నో పాఠశాలలో నిర్వహించినటువంటి ముందస్తు రక్షా బంధన్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశంలో రక్షాబంధన్ పండుగకు ప్రత్యేకత ఉన్నదని, మతసామరస్యాన్ని పెంపొందిస్తుందని తెలుపుతూ సోదర భావాన్ని సైతం పెంపొందిస్తుందని తద్వారా అభివృద్ధి చేరవేగంగా జరుగుతుందని వారు చెప్పారు. సోదరులు సోదరీమణులకు అండగా నిలుస్తామని ఎల్లప్పుడూ రక్షణగా ఉంటామని ప్రతిజ్ఞ చేస్తారని ఇది గొప్ప సాంప్రదాయమని సంతోషం వ్యక్తం చేశారు. ఇది ప్రేమ, నమ్మకం, బాధ్యత, అనురాగం మరియు కుటుంబం బంధాలకు ప్రత్యేకమైనదని అని తెలుపుతూ భారతీయ సంప్రదాయాలు విలువలు మరియు కుటుంబం సంబంధాల గొప్పతనాన్ని చాటిచెప్పే ఈ పండుగ ప్రతి ఒక్కరిలో సోదర భావాన్ని పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తూందని చెప్పారు వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా నృత్య ప్రదర్శనలు ఆలోచింపచేసాయి. అన్నయ్య నా అన్నయ్య, అన్నా చెల్లెల అనుబంధం తదితర నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాలలోని అన్నదమ్ములు -అక్క చెల్లెలు సాంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశారుఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు



## ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: స్వేరోస్ నెట్వర్క్

**గద్వాల్ల , ఆగస్టు27 :**

గద్వాల పట్టణంలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్వేరోస్ నెట్వర్క్ డిమాండ్ చేసింది. బుధవారం రాత్రి గద్వాల్ టౌన్ స్వేరోస్ నెట్వర్క్ బృందం ఈ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఎండి నవీద్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి రాత్రి భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం ఆహారం అందుతుందో లేదో అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న హాస్టల్ భవనం పూర్తిగా దెబ్బతిన్నందున తక్షణమే నూతన భవనాన్ని మంజూరు చేయాలి అనిణ సరైన బాత్రూమ్ వసతులు లేకపోవడంతో ఆరుబయట స్నానాలు చేయాల్సి వస్తోందని, మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో విషపురుగుల భయంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. విద్యార్థులు చదువుకోవడానికి (స్టడీ అవర్స్ కోసం) తగిన సంఖ్యలో కుర్చీలు ఏర్పాటు చేయాలి, హాస్టల్ కళాశాలకు దూరంగా ఉండటం వల్ల వెళ్లడానికి తీవ్ర ఇబ్బందిగా ఉందన, విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేయాలని కోరారు. పరిశీలించిన సమస్యలను స్వేరోస్ నాయకులు హాస్టల్ వార్డెన్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నూతన భవనం నిర్మాణం, మరుగుదొడ్ల మరమ్మతులు మరియు ఇతర మౌలిక వసతులను వెంటనే మెరుగుపరచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో టౌన్ స్వేరోస్ కమిటీ సభ్యులు రహమాత్, వెంకటేష్, రఫీ, వసంత్ కుమార్, మన్యం, తేజ తదితరులు పాల్గొన్నారు.





## సరితమ్మ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా “రాఖీ” వేడుకలు...

### కాంగ్రెస్ పార్టీ అన్నదమ్ములకు స్వీట్లు పంచి రాఖీ కట్టిన తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సరితమ్మ

**గద్వాల్ల , ఆగస్టు27 :**

’రక్షా బంధన్’ తోబుట్టువులకు పవిత్రమైన పండుగ ఈ సందర్భంగా గద్వాల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ సరితమ్మ క్యాంప్ కార్యాలయంలో గద్వాల నియోజకవర్గ ఆడపడుచుగా ప్రతి కష్టంలో తోడుగా నిలిచే కాంగ్రెస్ పార్టీ సోదరులకు తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సరితమ్మ రాఖీ కట్టి స్వీట్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు...ఈ సందర్భంగా రాఖీ కట్టించుకున్న కాంగ్రెస్ పార్టీ అన్నదమ్ములు సరితమ్మ వారి కుటుంబానికి రక్షణగా నిలస్తామని ప్రతిజ్ఞ చేశారు.. అనంతరం చైర్ పర్సన్ సరితమ్మ మాట్లాడుతూ తోడుంటారనే విశ్వాసానికి గుర్తు ‘రాఖీ’ పండుగ గద్వాల నియోజకవర్గ సోదర,సోదరీమణుల మధ్య అనుబంధాన్ని బలోపేతం చేస్తుందని,ఎల్లవేళలా అండగా, రక్షణగా ఉండాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆయా గ్రామాల సర్పంచ్ లు, మాజీ తాలూకా, మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు..

## భూ తగాదాలతో వ్యక్తిపై కర్రలతో దాడి

### కేసు నమోదు చేసిన మల్దకల్ పోలీసులు

**గద్వాల్ల , ఆగస్టు27 :**



భూ తగాదాల విషయంలో వ్యక్తి పై దాడి చేసిన కేసులో దాడులకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై మల్దకల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మల్దకల్ ఎస్ఐ శ్రీహరి తెలిపిన వివరాల మేరకు..ఉలిగేపల్లి గ్రామానికి చెందిన కుర్వ నర్సింహులు వారి బందువైన కుర్వ తిరుమలేష్, కుర్వ నర్సింహులు, కుర్వ జయన్న ల మధ్య గత కొంతకాలంగా భూవివాదం నడుస్తోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి కుర్వనర్సింహులు భూ సమస్య పై మాట్లాడేందుకు కుర్వ జయన్న ఇంటికి వెళ్లగా భూ తగాదాల నేపథ్యంలో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కుర్వ నర్సింహులపై కుర్వ జయన్న కుమారులు కుర్వ తిరుమలేష్, కుర్వ నర్సింహులు కర్రలతో దాడి చేసి గాయపరిచారు.



## అన్నాచెల్లెళ్ల ఆత్మీయత,రక్షణ భావానికి ప్రతీక రక్షాబంధన్ పండుగ

**కరీంనగర్ ఆగస్టు 27 :**

శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ముందస్తు రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని పౌర్ణమి యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యజ్ఞంలో పాల్గొని వేద మంత్రోచ్ఛారణల మధ్య హవన కార్యక్రమాన్ని నిర్వహించారు.రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు, పరస్పర ప్రేమకు, రక్షణ భావానికి ప్రతీక అని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సోదరభావం, దేశభక్తి వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ తెలిపారు.యజ్ఞం అనంతరం విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టుకుని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పాఠశాల ఆవరణం భక్తి, ఆనందోత్సాహాలతో కళకళలాడింది.కార్యక్రమంలో కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, డా. ఎలగందుల శ్రీనివాస్, కొణిజర్ల మహేష్, శిరీష, పులాల శ్యామ్, అల్లాడి ఆనంద్ కుమార్, ముసుకుల విద్యాసాగర్ రెడ్డి, పండుగ నాగరాజు, టి రాజేశ్వర్ రావు, అప్పిడి వకుళా దేవి తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యోగ జేఏసీ జోగులాంబ గద్వాల జిల్లా చైర్మన్ నాగార్జున గౌడ్ డిమాండ్

**గద్వాల , ఆగస్టు27 :**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఐడిఓసి ముందురాష్ట్ర శాఖ పిలుపుమేరకు జోగులాంబ గద్వాల జిల్లా జేఏసీ చైర్మన్ నాగార్జున గౌడ్ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. 2వ వేతన సవరణ సంఘం నివేదికను వెంటనే అమలు చేయాలి అని,ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలి అని,ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన సుమారు రూ.10,000 వేల కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి అని,కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.కొత్త ఉద్యోగుల ఆరోగ్య పథకం ను ఉద్యోగులకు పూర్తి స్థాయిలో, సమర్థవంతంగా అమలు చేసి, అవసరమైన మార్గదర్శకాలు మరియు సౌకర్యాలను కల్పించాలి.ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఈ దీర్ఘకాలిక డిమాండ్లపై తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కు తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ నాగార్జున గౌడ్, రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా సంఘ అధ్యక్షులు లక్ష్మారెడ్డి ,జేఏసీ కన్వీనర్ బీజాపూర్ ఆనంద్, ప్రభాకర్ శాస్త్రి, జేఏసీ నాయకులు మోహన్, రమేష్, గోపాల్ , ఎల్ల స్వామి, బుచ్చన్న, లక్ష్మీనారాయణ, టిఎన్జిఎస్ నాయకులు నాగేష్, విష్ణు, అబ్దుల్ బాబు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఉద్యోగులు అందరూ ఈ కార్యక్రమం పాల్గొని విజయవంతం చేశారు

# పోలీసుల అదుపులో గంజాయి బ్యాచ్

### కొంత మేర గంజాయి స్వాధీనం

**గద్వాల , ఆగస్టు27 :**

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గంజాయి పట్టుబడటం కలకలం రేపింది. జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఓ షెడ్డులో గంజాయి ఉందని సమాచారం మేరకు బుధవారం రాత్రి గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్ తనిఖీలు నిర్వహించగా ఒకరిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. వారి నుంచి కొంత మేరకు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వినికిడి. ఇదీ ఇలా ఉండగా ఇతర రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తి కూలీ పనుల కోసం గద్వాలకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే కార్మికుడి వద్ద లభించిన గంజాయి ప్యాకెట్లు ఎక్కడ నుంచి సరఫరా చేస్తున్నారో కనిపెట్టే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046